25CTR1:25CTR1.qxd 9/25/2026 11:34 PM Page 1



తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

30 వసంతాల ప్రస్థానం వార్త వార్షికోత్సవం 1996 - 2026

# వంద శాతం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీకి చర్యలు

**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి**



చిత్తూరు, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త: మొదటి రోజే వంద శాతం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీకి చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి అన్నారు. చిత్తూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం డిఎంహెచ్‌ఓ డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఓ డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 1-19 సంవత్సరాల మధ్య 3,10,910 మంది విద్యార్థులు వున్నారని, ఇందులో 2,102 అంగన్‌వాడీ కేంద్రాల్లో 63,963 మంది విద్యార్థులు, 2,248 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 2,09,245 మంది విద్యార్థులు, 134 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో 37,234 మంది విద్యార్థులు వున్నారని, ఈ విద్యార్థులందరికీ శుక్రవారం వైద్య సిబ్బంది అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తారన్నారు. 1-2 సంవత్సరాల పిల్లలకు అర్ధ ఆల్బెండజోల్ మాత్ర, 3-19 సంవత్సరాల విద్యార్థులకు ఒక మాత్రను మధ్యాహ్న భోజనం అనంతరం ఇచ్చి చప్పిరించి మింగేలా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె రాష్ట్ర పరిశీలకులు వినోద్‌కుమార్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, జిల్లా ఆర్‌బిఎస్‌కె సమన్వయకర్త డాక్టర్ గిరి, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణ మీ బాధ్యత

## క్రమశిక్షణ మీ ఉజ్వల భవిష్యత్తుకు దోహదం

## రాష్ట్ర మంత్రి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

## పిటిసిలో 581 మంది కానిస్టేబుళ్ళ పాసింగ్ అవుట్



చంద్రగిరి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త: విధినిర్వహణలో శాంతి భద్రతల పరిరక్షణ మీ బాధ్యత అని రాష్ట్ర రవాణా, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. కళ్యాణీ డ్యామ్ వద్ద గల పోలీస్ శిక్షణా కళాశాల (పిటిసి)లో శుక్రవారం 581 మంది శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ళు పాసింగ్ అవుట్ పెరేడ్ అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన మంత్రి వారి నుండి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం 6 వేల మంది కానిస్టేబుళ్ళను ఎంపిక చేయడం జరిగిందన్నారు. తద్వారా 6 వేల కుటుంబాలలో సంతోషాలను నింపారని అన్నారు. క్రమశిక్షణ, నైతిక విలువలు మీ ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడగలవన్నారు. శిక్షణలో నేర్చుకున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని, చట్టాలపై గల అవగాహనను విధినిర్వహణలో సమర్ధవంతంగా వినియోగించాలన్నారు. ముఖ్యంగా ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ పోలీసు శాఖ గౌరవాన్ని ఇనుమడింపజేయాలన్నారు. అంతకు ముందు శిక్షణా కాలంలో ఇండోర్, అవుట్ డోర్, ఫైరింగ్, ఆల్‌రౌండ్ విభాగాలలో ప్రతిభ కనబరిచిన వారికి మంత్రి చేతుల మీదుగా ట్రోఫీలు, ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. అదేవిధంగా పిటిసిలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎంఎల్‌ఏ పులివర్తి నాని, ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, పిటిసి ప్రిన్సిపాల్ ఎం.మహేష్‌కుమార్, తిరుపతి నగర పాలక సంస్థ కమీషనర్ ఎం.జయకృష్ణ శిక్షణా కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుని విధుల్లోకి వెళుతున్న ప్రతి ఒక్కరికీ, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. విధినిర్వహణలో అంకితభావంతో ప్రజలకు సేవలందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుపతి టిడిపిలో లోపాయికారి నేతలు ?

## దూకుడు పెంచిన వైసిపి నేతలు-మౌనం పాటిస్తున్న టిడిపి నాయకులు



ప్రభాతవార్త-తిరుపతి: టిడిపి భవిష్యత్తు నేత జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేశ్ టీమ్‌లోని కొందరు నేతలపై తిరుపతి జిల్లాలో తీవ్రస్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. యువనేత ఏరి కోరి పదవులు ఇచ్చిన పలువురు నేతలు వైసిపి నేతల రాజకీయ విమర్శలకు సరైన స్థాయిలో ప్రత్యారోపణలు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా మాజీ ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి చేస్తున్న రాజకీయ విమర్శలను సమర్ధంగా ఎదుర్కొనే విషయంలో టిడిపి నేతలు వెనుకబడుతున్నారనే చర్చ పార్టీ వర్గాల్లో సాగుతోంది. కొందరు నేతలు పగలు టిడిపిలో, రాత్రి వైసిపి నేతలతో సన్నిహితంగా ఉంటున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. పార్టీ కార్యక్రమాల్లో తూతూమంత్రంగా పాల్గొని, ఫోటోలు, సామాజిక మాధ్యమాల్లో పోస్టులతో తమ బాధ్యత పూర్తయినట్లు భావిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పార్టీ కార్యక్రమాల కమిటీలను, రాష్ట్ర స్థాయి నేతలను ప్రసన్నం చేసుకోవడం ద్వారా లోకేశ్‌కు దగ్గరగా ఉండేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడిగా తిరుపతి జిల్లా ఇన్‌చారి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ రెండేళ్లలో పార్టీకి ఆశించిన స్థాయిలో ప్రయోజనం చేకూరలేదని కొందరు టిడిపి నాయకులు, కార్యకర్తలు బాహాటంగా చెబుతున్నారు. ఆయన ఒక వర్గానికి ప్రాధాన్యతనిస్తూ మిగిలిన నాయకులను పక్కన పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సీనియర్ నేతలను పట్టించుకోకుండా తనకు అనుకూలమైన వారికి పదవులు ఇప్పించుకున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఆయన ప్రోత్సహించిన కొందరు నేతలు కూడా వైసిపి నాయకులపై రాజకీయంగా దూకుడుగా వ్యవహరించడం లేదనే చర్చ ఉంది. కేంద్ర మాజీ మంత్రి, పార్లమెంటు అధ్యక్షురాలు పనబాక లక్ష్మి కూడా తిరుపతిలో తన ఉనికిని చాటుకునే కార్యక్రమాలకే పరిమితమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో తిరుపతి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన ఆమె, కనీసం వైసిపి ఎంపి గురుమూర్తిపై కూడా పెద్దగా విమర్శలు చేసిన దాఖలాలు లేవు. చంద్రగిరికి చెందిన దివాకర్ రెడ్డి తుడా చైర్మన్, టిటిడి ఎక్స్ అఫిషియో సభ్యత్వం, పార్లమెంటు ప్రధాన కార్యదర్శి వంటి కీలక పదవులు లభించాయి. అయితే వైసిపి నేతలను రాజకీయంగా కట్టడి చేసే విషయంలో ఆయన చురుకైన పాత్ర పోషించడంలేదనే విమర్శలు ఉన్నాయి. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ జి. నరసింహ యాదవ్ కూడా మాటలకే పరిమితమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇంకొందరి నేతల వ్యవహారశైలి వల్ల పార్టీకి మేలు కంటే నష్టం ఎక్కువగా జరిగిందనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. పార్టీ రాష్ట్ర కార్యదర్శి అన్నా అనితా యాదవ్ వైసిపి నేతలపై రాజకీయంగా ఎదురుదాడి చేసిన సందర్భాలు చాలా తక్కువేనని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

తిరుపతి కార్పొరేషన్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, పై పదవుల్లో ఉన్న పలువురు నేతలు మేయర్ పదవిపై ఆశలు పెట్టుకున్నారనే ప్రచారం జరుగుతోంది. పార్టీ కోసం క్షేత్రస్థాయిలో పోరాడటం కంటే పదవుల కోసం ప్రయత్నించడంపైనే కొందరు దృష్టి పెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వీరిలో కొందరు భూమన కరుణాకర్ రెడ్డితో లోపాయికారి సంబంధాలు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

# రావణబ్రహ్మ వాహనంపై విహరించిన విఘ్ననాథుడు

కాణిపాకం, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉభయదేవేరులతో గణనాధుడు రావణబ్రహ్మ వాహనంపై కాణిపాకం పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయహస్తమిచ్చాడు. ఆల యంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల ప్రత్యేక ఉత్స వాల్లో భాగంగా రెండవ రోజు స్వామివారికి రావణబ్రహ్మ వాహన సేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి పుణ్యసముద్రం, లక్ష్మాంబపురం, సంతపల్లె, ద్వారకాపురం, కురప్పల్లె, సిద్దంపల్లె గ్రామస్థులు ఉభయదారులుగా వ్యవహరిం చారు. వీరు ఉదయం వరుస ఉభయం తీసుకురాగా అర్చకస్వా ములు స్వామివారి మూలవిరాట్‌కు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక అభిషేకాలను, పూజలను నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే రాత్రి సిద్ధి, బుద్ధి సమేతుడైన గణనా థుని ఉత్సవమూర్తులను అన్వేటి మండపంలో వుంచి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ధూపధీపనైవేద్యాలను సమర్పించారు. అనంతరం రంగురంగుల విద్యుద్ధీపాలు, వివిధ రకాల పరిమళ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించిన రావణబ్రహ్మ వాహనంపై ఉభయదేవేరులతో స్వామివారు అధిరోహించి మంగళ వాయిద్యాలు, వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనల నడుమ కాణిపాకం గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయ హస్తం అందించారు. ఈసందర్భంగా భక్తులు నారికేళ సమర్పణలతో మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వి.మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, ఏఈఓలు రవీంద్రబాబు, ధనపాల్, ఆలయ సూపరెండెంట్‌లు వాసు, కోడండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, రవిలతో పాటు ఉత్సవ ఉభయదారులు పాల్గొన్నారు.



# ఘోర రోడ్డు ప్రమాదం

## రోడ్డుపక్కన బిడ్డకు పాలిస్తున్న తల్లిపై దూసుకెళ్ళిన ఇన్నోవా వాహనం

## తల్లి, బిడ్డకు, భర్తకు తీవ్రగాయాలు..తిరుపతి ఆసుపత్రికి తరలింపు.



పెద్దపంజాణి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త: తన పుట్టింటికి వచ్చి నాటువైద్యం చేయించుకుని భర్తతోపాటు ఇంటికి తిరిగి వెళుతున్న భార్య పిల్లకు ఆకలి వేయడంతో రోడ్డుపక్కన టూవీలర్‌ను ఆపి పాలిస్తుండగా అంతలోనే వారిపై ఓ ఇన్నోవా వాహనం దూసుకువచ్చిన సంఘటన శుక్రవారం మండలంలోని పెద్దారికుంట బస్‌స్టాప్ సమీపంలో చోటుచేసుకుంది.దీంతో తల్లి పిల్లలకు తీవ్రగాయాలు కాగా వారికి మెరుగైన చికిత్స నిమిత్తం తొలుత పుంగనూరు ఆసుపత్రి ఆపై పరిస్థితి కొంత విషమంగా ఉండటంతో తిరుపతికి తరలించారు.ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా..పెద్దపంజాణి మండలం ముత్తుకూరు గ్రామానికి చెందిన మాధురికి పుంగనూరు మండలం దిగువకొండమీదపల్లికి చెందిన మురళితో గతంలో వివాహమైంది వీరికి ఇద్దరు ఆడపిల్లలు సంతానం కలిగారు.శుక్రవారం మాధురి తన భర్త,పిల్లతో తన స్వగ్రామమైన ముత్తుకూరుకు వచ్చి అనారోగ్యంగా ఉండటంతో నాటుమందు తీసుకుని తిరిగి ద్విచక్రవాహనంలో పిల్లలతో సహా ప్రయానమయ్యారు.మార్గమద్యంలో పిల్లలకు ఆకలి వేయడంతో పెద్దారికుంట రోడ్డు పక్కన బస్‌స్టాప్‌కు కొంత దూరంలో మురళి ద్విచక్రవాహనాన్ని ఆపగా మాధురి పిల్లలకు పాలిచ్చేందుకని కూర్చొంది.ఇంతలోనే అటువైపుగా వేగంగా వచ్చిన ఓ ఇన్నోవా వాహనం వీరిన వేగంగా వచ్చి ఢీకొంది.దీంతో మాధురి,భర్తమురళీతో సహా పిల్లకు తీవ్రగాయాలయ్యాయి.ఇది గమనించిన స్థానికులు 108 సాయంతో పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అయితే పరిస్థితి కొంత విషమంగా ఉండటంతో వైద్యులు తిరుపతి ఆసుపత్రికి రెఫర్‌చేసినట్లు సమాచారం.కాగా వీరిని ఢీకొన్న ఇన్నోవా వాహనంకు నెంబరుప్లేటు సైతం లేదని స్థానికులు పేర్కొన్నారు.ప్రమాదం జరిగిన వెంటనే ఇన్నోవా వాహనం ఆపకుండా మరింతవేగంగా వెళ్ళిందని స్థానికులు తెలిపారు.ఈ విషయంగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పెద్దపంజాణి పోలీసులు తెలిపారు.

# దరఖాస్తులు సమర్పయామి

## కుప్పం మున్సిపల్ ఛైర్మన్‌కై దేశం నేతల దరఖాస్తులు !!



కుప్పం, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త సిఎం చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం కుప్పంలోని కుప్పం పురపాలక సంఘం ఛైర్మన్ పదవిని ఆశిస్తున్న నాయకులు తమ దరఖాస్తులను శుక్రవారం స్థానిక తెదేపా కార్యాలయంలో ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, సిఎం పిఎ శ్రీకాంత్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్‌లకు అందజేశారు. సుమారు ఇరవైమందికి పైగా ఛైర్మన్ గిరి ఆశిస్తున్న నాయకులు తమ బయోడేటాలతో పాటు దరఖాస్తులను అందజేశారు. వీటిని శనివారం చిత్తూరు తెదేపా కార్యాలయంలో అందజేయనున్నట్లు సమాచారం. మున్సిపల్ ఛైర్మన్ పదవి ఆశిస్తున్న ముఖ్య నేతలతో పాటు లక్ ఉంటే ఏదైనా జరగవచ్చు అని భావించి సైతం పలువురు నాయకులు మున్సిపల్ ఛైర్మన్ పదవిని ఆశిస్తూ దరఖాస్తులు అందించడం గమనార్హం. అయితే ప్రజల అభిప్రాయం తీసుకున్నాకే మున్సిపాలిటీ ఛైర్మన్ అభ్యర్థిని ప్రకటిస్తానని ఇదివరకే సిఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేసిన విషయం విదితమే. పార్టీ తరపున ఛైర్మన్ అభ్యర్థిత్వం ఆశిస్తున్న వారిలో పార్టీ సీనియర్ నాయకులు, ప్రస్తుత కౌన్సిలర్లతో పాటు పలువురు నాయకులు ఉండడం విశేష ం.

## తిరుపతి వేదికగా

# గిరిజన కళా వైభవం

## దేశం నలుమూలల నుంచి కళాబృందాలు..

## సంప్రదాయ నృత్యాలు, జానపద గీతాలతో సందడి



తిరుపతి విద్య సెప్టెంబర్ 24ప్రభాతవార్త దేశంలోని విభిన్న గిరిజన సంస్కృతులకు తిరుపతి వేదికైంది. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన గిరిజన కళాకారులు సంప్రదాయ నృత్యాలు, జానపద గీతాలు, వాయిద్య ప్రదర్శనలతో తమ సంస్కృతీ వైభవాన్ని చాటారు. ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ గిరిజన సాంస్కృతిక మహోత్సవాలు శుక్రవారం ఎస్వీయూలోని శ్రీనివాస ఆడిటోరియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి.కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు పి. వెంకటప్ప, ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం. భూపతి నాయుడు పాల్గొన్నారు. గిరిజన కళలు, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు పరిరక్షణ చర్యలు అవసరమని వారు పేర్కొన్నారు.ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ గిరిజన కళలు, సంప్రదాయాలు దేశ సాంస్కృతిక సంపదలో అంతర్భాగమన్నారు. గిరిజన యువత విద్యతోపాటు తమ మూలాలు, సంప్రదాయాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కళాకారులకు ప్రోత్సాహం అందించి వారి ప్రతిభకు తగిన గుర్తింపు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ గిరిజనుల జీవన విధానం, ఆచారాలు, సంప్రదాయాలు వారి కళారూపాల్లో ప్రతిబింబిస్తాయని తెలిపారు. కనుమరుగవుతున్న సంప్రదాయ కళలను కాపాడేందుకు ప్రత్యేక దృష్టి అవసరమన్నారు. వివిధ రాష్ట్రాల కళాకారులు ఒకే వేదికపై తమ ప్రాంతీయ కళలను ప్రదర్శించడం ద్వారా గిరిజన సంస్కృతుల వైవిధ్యం ప్రజలకు పరిచయమవుతుందని చెప్పారు.రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు పి. వెంకటప్ప మాట్లాడుతూ గిరిజనుల విద్య, ఉపాధి, సామాజిక సాధికారతతో పాటు సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం. భూపతి నాయుడు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు విద్య, పరిశోధనలకే పరిమితం కాకుండా దేశంలోని భిన్న సంస్కృతులకు వేదికలుగా నిలవాలని పేర్కొన్నారు.మహోత్సవాల ప్రారంభానికి ముందు ఎస్వీయూ ప్రధాన ద్వారం వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి అతిథులు, టీఎస్ఎఫ్ నాయకులు, కళాకారులు పుష్పాంజలి ఘటించారు. అనంతరం గిరిజన కళాబృందాలతో శ్రీనివాస ఆడిటోరియం వరకు సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. సంప్రదాయ వేషధారణలు, నృత్యాలు, వాయిద్యాల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.టీఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు కరంశి అక్కులప్ప నాయక్ మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల గిరిజన విద్యార్థులు, కళాకారులను ఒకే వేదికపైకి తీసుకురావడమే మహోత్సవాల ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముడావత్ విష్ణు నాయక్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు. రెండు రోజులపాటు జరిగే మహోత్సవాల్లో మరిన్ని గిరిజన కళా, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నారు.

# జనసేనలోకి చేరికలు

## శ్రీకాళహస్తిలో మారుతున్న రాజకీయ సమీకరణలు



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 25 ప్రభాతవార్త శ్రీకాళహస్తికి చెందిన రెండు బిసి సామాజిక వర్గాలకు చెందిన యువకులు శుక్రవారం జనసేన పార్టీ నేత పవన్ కళ్యాణ్‌ను కలసి పార్టీ కండువాను కప్పుకున్నారు. యువ నాయకుడు సత్రవాడ ప్రవీణ్, మాజీ కౌన్సిలర్ మిద్దెల హరిలు తమ అనుచరులతో పవన కళ్యాణ్‌ను కలసినట్లు సమాచారం. అలాగే శ్రీకాళహస్తికి చెందిన పార్టీలో ఆది నుంచి ఉన్న కొందరు యువకులు రామ్‌తాళ్ళూరిని కలసి ఇక్కడి రాజకీయ సమీకరణలను వివరించారు. ఆయన యువ కులకు సూచనలిస్తూ పార్టీ కోసం కలసి పని చేయాలని ఆదేశిం చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి జనసేన పార్టీలో కీలకమార్పులు చేర్పులు చోటు చేసుకోనున్నాయి.

**మారుతున్న రాజకీయ సమీకరణలు:**

శ్రీకాళహస్తి రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. వైసిపి అధికా రంలో లేకపోటం ఆ పార్టీ నాయకుడు పట్టించుకోక పోవటం ఇక కూటమిలో తెలుగుదేశం పార్టీలో గుర్తింపులేకపోవటంతో పలు వురు యువకుల 'జనసేన పార్టీ వైపు' మొగ్గుచూపుతున్నారు. శుక్ర వారం జనసేన పార్టీ నాయకుడు పవన్ కళ్యాణ్ శ్రీకాళహస్తికి చెం దిన యువకుల్ని పార్టీలో కండువా కప్పి నట్లు చర్చ జరుగుతుంది. అయి తే యువకుల నిర్ణయంతో 'వైసిపి'కి భారీ నష్టం వాటిల్లుతు న్నట్లు రాజకీయ నాయకుల సమీకరణలు. అయితే ఎవరున్నా ఎవరులే కున్నా ఈసారి మనం లక్ష ఓట్ల మెజారిటీతో గెలుస్తామనే ధీమా మాజీ శాసనసభ్యుడు,ఆయన అనుచరుల్లోచోటు చేసుకుంది. అంతేకాక ప్రస్తుతం పార్టీని వీడి పోతున్న వారిలో ఒక్కరికి కూడా ఓటు బ్యాంకు లేదని సమర్థించుకుంటున్నారు.

**ఓటు బ్యాంకు సమీకరణలతో...**

రాష్ట్రంలో రాజకీయాల పరిస్థితి ఎలా ఉన్నా శ్రీకాళహస్తిలో వాతావరణం భిన్నంగా ఉంటుంది.దీమా కల్గిన వారిని మట్టి కరిపించటం ఇక్కడ ఓటర్ల నైజం. మరో 25 సంవత్సరాలు తాను శ్రీకాళహస్తి సామ్రాజ్యానికి రాజును అంటూ విర్రవీగిన వైకాపా నాయకుని సుమారు 43వేల ఓట్ల తేడాతో ఓడించారు.ఇక ఎన్నికల వరకు అధికార పార్టీలో గెలిచిన నాయకుని తీరు ప్రస్తుతం ఆయన తీరు కొందరికి నచ్చటం లేదు. ఆయన మాట తీరు ముక్కుసూటి తనం ఆయనకు ఇబ్బందిగా మారింది.అంతేకాక పార్టీలో కొందరికే ప్రాధాన్యత కల్పిస్తున్నారంటూ కొందరు తీవ్ర అసంతప్తితో ఉన్నారు. అయితే యువతకు పెద్దపీట వేయటానికి అధికార పార్టీ నాయకుడు నిర్ణయం తీసుకున్నారు. ఇక నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడపటానికి నిధుల సాధనలో ఆయన పరుగులు తీస్తున్నారు.

**రాజకీయంగా పెనుమార్పులు:**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కుల రాజకీయ సమీకరణలు అధికంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో జనసేనలోకి వలసలు వెళ్ళానుకుంటున్న వారిలో బిసి సామాజిక వర్గం అధికంగా ఉన్నారు.ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో బిసి (వన్నెకుల క్షత్రియ)కు చెందిన సత్రవాడ ప్రవీణ్ యువకుడు.ఆయన తండ్రి మున్సిపల్ కౌన్సిలర్‌గా రాజకీయ ప్రస్తానం ప్రారంభించి ఎంఎల్‌ఏగా గెలిచి తరువాత తుడా చైర్మెన్‌గా రాణించారు. ఆయన తనయుడుసత్రవాడ ప్రవీణ్ తెలుగుదేశం పార్టీకి ఎన్నికల్లో పని చేసారు. తరువాత ఆయనపై అభియోగాలతో పట్టించుకోలేదని అసంతృప్తితో ఉన్నారు. ఇక వైసిపికి చెందిన మరో బిసి నాయకుడు మిద్దెల హరి(చేనేత కార్మిక రంగం) ఆయన 2014 నుంచి 2019 వరకు వైకాపా మున్సిపల్‌ఫ్లోర్‌లీడర్‌గా వ్యవహారించారు. పార్టీ పిలుపుమేరకు పలు కార్యక్రమాలు చేపట్టారు. పార్టీలో ఎంతో యాక్టివ్‌గా ఉన్నారు. ఎన్నికల ముందు ఆయన తెలుగుదేశం పార్టీలో చేరుతారనే ప్రచారం జరిగింది. అయితే ఆయన చేరలేదు. వైకాపాలోనే కొనసాగారు.కానీ తరువాత వైకాపా నాయకుడు పట్టించుకోలేదు. దాంతో గుర్తింపు లేని చోట ఎందుకు ఉండాలనే అసంతృప్తితో ఉన్నారు.ఆయన ప్రస్తుతం నిర్ణయం తీసుకున్నారు.

### సత్రవాడకు పగ్గాలా?

శ్రీకాళహస్తి జనసేన పార్టీ పగ్గాలను సత్రవాడ ప్రవీణ్‌కు అందిస్తారా? అన్నది వేచి చూడాలి. అయితేపార్టీ ప్రదాన కార్యదర్శి రామ్ తాళ్ళూరి తో పలువురు నాయకులు హైదరాబాదులో కలసినట్లు తెలిసింది. వారిలో సత్రవాడ ప్రవీణ్, మిద్దెల హరి,మాజీ చైర్మెన్ ముత్యాల పార్ధసారధి, మాజీ టౌన్‌బ్యాంకు చైర్మెన్ సురేష్‌ల సారధ్యంలో మరి కొందరు యువకులు కలసి శ్రీకాళహస్తిలోని పరిస్థితిని వివరించినట్లు సమాచారం.అయితే గతంలో తృటిలో తప్పిన మున్సిపల్ చైర్మెన్‌గిరిపై గురి పెట్టుకున్న మిద్దెల హరి ఈ మేరకు మొదట పార్టీలో చేరుతున్నట్లు ప్రచారం జరుగుతుంది.ఇక సత్రవాడ ప్రవీణ్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోరుతున్నట్లు స్థానికంగా ప్రాచారం జరుగుతుంది.వీరితో పాటు పలువురు మాజీ కౌన్సిలర్లు పార్టీ తీర్థంనుపుచ్చుకోనున్నట్లు సమాచారం.శ్రీకాళహస్తిలో జనసేన పార్టీ తన బలం పెంచుకోనున్నట్లు చర్చించుకుంటున్నారు.

# తిరుపతి డివిజన్

## మీ భూమి మీ హక్కు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ



*ఓబులవారిపల్లి, 25 సెప్టెంబర్ ప్రభాతవార్త* ఓబులవారిపల్లి మండలం జివిపురం పంచాయతీ నూకనపల్లి గ్రామంలో రైల్వే కోడూరు శాసనసభ్యుడు అరవ శ్రీధర్ ఓబులవారిపల్లి తాసిల్దార్ సిద్దేశ్వరరావు ఆధ్వర్యంలో మీ భూమి మీ హక్కు పట్టాదారు పాసు పుస్తకాలను. లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రం అంచెలంచెలుగా అభివృద్ధి చెందిందన్నారు. వ్యవసాయానికి రైతు సంక్షేమానికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుంది అన్నారు రీ సర్వే ద్వారా రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా భూ.హక్కులు మరియు హద్దులు శాశ్వతంగా ఉండేలా రైతులకు ఇబ్బంది లేకుండా రెవెన్యూ అధికారులు శాశ్వత పరిష్కారం చేసి రీ సర్వే ద్వారా పూర్తి పొందిన పట్టాదారు పుస్తకాలను పంపిణీ చేయడం ఎంతో శుభ పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరాజు. పొన్నాటి వాసుదేవరెడ్డి. మాజీ ఎంపీటీసీ సభ్యులు ఎన్ ఆర్ పనేంద్ర. మరియు కూటమి నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు

## రాళ్లచెరువుపల్లిలో మీ భూమి మీ హక్కు..

*ఓబులవారిపల్లి 25 సెప్టెంబర్ ప్రభాతవార్త* ఓబులవారిపల్లి మండలం రాళ్లచెరువు పల్లి పంచాయతీలో మీ భూమి హక్కు పట్టాదారు పాస్ పుస్తకాలను శుక్రవారం కూడా చైర్మన్ టిడిపి ఇన్చార్జి. ఒక్క రూపానంద రెడ్డి, మరియు రైల్వే కోడూరు శాసనసభ్యుడు, తాసిల్దార్ సిద్దేశ్వర రావు అధ్యక్షతన కూటమి నాయకులు పోలి. నరసారెడ్డి ఆధ్వర్యంలో పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు



మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజా సంక్షేమ ధ్యేయంగా మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో రాష్ట్రం అంచెలంచెలుగా అభివృద్ధి చెంది జనరంజక పాలన సాగిస్తుందన్నారు. అనంతరం రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు వాసుదేవ రెడ్డి మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరాజు రాళ్లచెరువు పల్లి కూటమి నాయకులు.కార్యకర్తలు పాల్గొన్నారు.

## 27న కబడ్డీ జిల్లా జూనియర్ జట్ల ఎంపిక...



రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబర్ 25(ప్రభాతవార్త):: అన్నమయ్య జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 27న కబడ్డీ జిల్లా జూనియర్ బాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు అసోసియేషన్ సెక్రటరీ పి అరుణ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కోడూరు మండలంలోని కాకతీయ పాఠశాల నందు ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎంపిక కార్యక్రమాన్ని ఇదే పాఠశాలలో జరుగుతుందని జూనియర్ విభాగంలో 20 సంవత్సరాలు లేదా అంతకంటే తక్కువ వయసు ఉన్న తర్వాత పుట్టిన బాలురు, 29 11 2006 తర్వాత పుట్టిన బాలికలు అర్హులని తెలిపారు. బాలురు 75 కేజీలు అంతకంటే తక్కువ బరువు బాలికలు 65 కేజీలు అంతకంటే తక్కువ బరువు ఉండాలని తెలిపారు. గ్రామపంచాయతీ లేదా మున్సిపాలిటీ వారు జారీ చేసిన జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్, మార్క్స్ మెమో ఏదైనా ఒక ఒరిజినల్ సర్టిఫికెట్ తో ఎంపిక పోటీల్లో పాల్గొనాలని తెలియజేశారు. ఇతర వివరాలకు 9392 951505 నెంబర్ను సంప్రదించాలని అరుణ రెడ్డి తెలిపారు.

## అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఎన్టీఆర్ సేవా ట్రస్ట్ ఆర్థిక చేయూత.



*చిట్వేలి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:* చిట్వేలి గ్రామం, శింగనమల వీధికి చెందిన టంగుటూరి మస్తాన్ కుటుంబం ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో తీవ్రంగా ఆస్తి నష్టాన్ని చవిచూసింది. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచిన ఎన్టీఆర్ సేవా ట్రస్ట్ తరపున శుక్రవారం రూ.20,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ ఆర్థిక సాయన్ని ఎన్టీఆర్ సేవా సమితి కమిటీ సభ్యులు లారీ సుబ్బరాయుడు, బాలు రామాంజనేయులు నాయుడు, చిట్వేలి మండల టీడీపీ అధ్యక్షుడు కాకర్ల నాగార్జున నాయుడు, తుంగ దినేష్, కాకర్ల కోటేశ్వరరావు, తుంగ మధు, తుంగ చందు, గ్రామ పార్టీ అధ్యక్షుడు పగడాల వెంకటేష్, యూనిట్ శివ తదితరులు కలిసి బాధిత కుటుంబానికి అందజేశారు.తమకు అందించి అండగా నిలిచిన ఎన్టీఆర్ సేవా ట్రస్ట్ సభ్యులకు టంగుటూరి మస్తాన్ కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## సమస్యలు తెలపండి....పరిష్కారం పొందండి



*రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త* రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన ప్రజల సమస్యల పట్ల రైల్వేకోడూరులో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజా సమస్యల తెలిపి పరిష్కారం పొందాలని రైల్వేకోడూరు టిడిపి ఇన్చార్జి ముక్కా రూపనంద రెడ్డి అన్నారు. శుక్రవారం రైల్వే కోడూరు మండలంలోని రాఘవ రాజపురం టిడిపి కార్యాలయం నందు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల అధికారులు అత్యంత వేగవంతంగా చొరవ చూపాలని వారు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో వచ్చే సమస్యల పట్ల అధికారులు మానవీయ కోణంలో పనిచేయాలని ఆయన సూచించారు. నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి,చిట్వేలి,పెనగలూరు,పుల్లంపేట,కోడూరు ప్రాంతం నుండి భారీగా అర్జీదారులు పాల్గొన్నారు అని వారి సమస్యల పట్ల సంబంధిత అధికారులతో చర్చించి తక్షణమే పరిష్కారం మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతులతో పాటు భూ సమస్యలు, పెన్షన్ తదితర సమస్యలు వస్తున్నాయని సంబంధిత అధికారులు కూడా వచ్చిన అర్జీదారుల సమస్యలపై అధికారులు తక్షణమే చర్య తీసుకొని పరిష్కారాలకు మార్గాలు చూపాలని రూపనంద రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి ముక్కా వరలక్ష్మమ్మ, శేఖర్ రాజు, బీసీ నాయకులు కమతం నాగరాజు, తిరుపతి శేఖర్, వేమన సుబ్రహ్మణ్యం నాయుడు, తిమ్మిశెట్టిపల్లి మనీ, అకేపాటి సుకుమార్ రెడ్డి, పటాన్ మోలా, ముంతాజ్ మెహతాజ్ బేగం, కొమ్మా శివ, టిడిపి మాజీ అధ్యక్షుడు పందేటి వెంకటరామరాజు తో పాటు ఐదు మండలాలకు చెందిన టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

## మద్యం షాపుల కేటాయింపునకు ఆన్లైన్ దరఖాస్తులు

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబర్ 25(ప్రభాతవార్త):: తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలో ఉన్న ఖాళీగా ఉన్న ఎనిమిది మద్యం షాపుల కేటాయింపునకు సంబంధించిన ఆన్లైన్ అభ్యర్థుల నుండి ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రైల్వేకోడూరు ఎక్సైజ్ సీఐ తులసి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం పాలసీ ఎ 4 202627 ప్రకారం ఈ కేటాయింపుల ప్రక్రియ చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం ఎనిమిది షాపులు ఖాళీగా ఉన్నాయని వాటిలో రైల్వేకోడూరులో ఆరు, ఓబులవారిపల్లిలో ఒకటి, చిట్వేలి లో ఒక షాపు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రొవిజన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారిక పోర్టల్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని వారు తెలిపారు. అక్టోబర్ ఒకటవ తేదీ రాత్రి 12 గంటల వరకు గడువు ఉంటుందని ఆ తర్వాత సమర్పించిన దరఖాస్తులను పరిశీలించబోమని వారు తెలిపారు.

## ముఖ్యమంత్రిని కలిసిన కొండా వెంకటేష్.



*చిట్వేలి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:* చిట్వేలి మండల టీడీపీ ఉపాధ్యక్షుడు కొండా వెంకటేష్, రాష్ట్ర ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ చైర్మన్ కేకే చౌదరి ఆధ్వ ర్యంలో శుక్రవారం విజయవాడలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడిని మర్యాద పూర్వకం గా కలిశారు. నగిరిపాడు గ్రామపంచాయతీ అభివృ ద్ధికి మూడు వాటర్ ప్లాంట్లు, సిమెంటు రోడ్లు, తారు రోడ్లు, ఆలయాల అభివృద్ధి, ఎస్సీ–ఓసీ కమ్యూనిటీలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తనకు ఎంపీపీ లేదా జెడ్పీటీసీగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. అభివృద్ధి అంశాలపై సీఎం సానుకూలంగా స్పందించారని కొండా వెంకటేష్ పేర్కొన్నారు.

## సీఎం సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్న భాను అవినాష్



*ఓబులవారిపల్లి 25 సెప్టెంబర్ ప్రభాతవార్త* ఓబులవారిపల్లి మండలం మంగంపేట గ్రామానికి చెందిన గల్లా భాను అవినాష్ సీఎం సమక్షంలో శుక్రవారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో ఏపీ సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకొని సభ్యత్వం నమోదు చేశారు. సందర్భంగా సీనియర్ టిడిపి నాయకులు గల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ మర్యాదపూర్వకంగా సీఎం చంద్రబాబును కలవడం జరిగిందని అలాగే మంగంపేటలో ఉన్న పల్వరైజింగ్ మిల్లులు మోతుపడ్డాయని వాటిని పునః ప్రారంభించి వ్యాపారులకు తగిన ప్రాధాన్యత ఇచ్చి ముగ్గురాయిని సరఫరా చేయాలన్నారు. అలాగే మంగంపేటలో ఉన్న పలు సమస్యల గురించి వివరించామన్నారు. అన్నిటికి సానుకూలంగా స్పందించి అన్ని విధాల సమస్యలు పరిష్కారాన్ని కృషి చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు

## ఘనంగా అంగన్వాడీ ఉత్సవాలు



చిట్వేలి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త: సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 7 వరకు నిర్వహిస్తున్న అంగన్వాడీ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం చిట్వేలిలోని కుమ్మరవీధి, మేదరవీధి, చిట్వేలి1, 2, 3 అంగన్వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మండలవ్యాప్తంగా నాలుగు విడతల్లో, ఒక్కో అంగన్వాడీ కేంద్రంలో మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ఆర్. వసుంధరమ్మ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు అందుతున్న సేవలు, వాటి ప్రయోజనాలు, సామాజిక కార్యక్రమాలు, ప్రీస్కూల్ విద్య తదితర అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించామన్నారు. ప్రతి నెలా పిల్లల బరువులు నమోదు చేసి వారి ఆరోగ్య పరిస్థితిని తల్లులకు తెలియజేస్తున్నట్లు తెలిపారు. నవచేతన స్క్రీనింగ్ యాప్ ద్వారా పిల్లల వివరాల నమోదు, పీఎంఎంవై పథకం గురించి వివరించామన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రాస్ కార్యాలయంలో సామూహిక లక్ష్మీ పూజ



రేణిగుంట, సెప్టెంబరు 25, ప్రభాతవార్త: రేణిగుంట మండలం కరకంబాడి గ్రామంలోని రాస్ కార్యాలయ నందు రాస్ మహిళా జ్యోతి మ్యూ చువల్ బెనిఫిట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సామూహిక లక్ష్మీ పూజా మహోత్సవాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పొదుపు సంఘాల సంచాలకులు వి. నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి 200 మందికి పైగా సభ్యులు, మహిళలు హాజరయ్యారు.పూజా కార్యక్రమానికి అవస రమైన పూలు, పండ్లు, కుంకుమ, పసుపుతో పాటు ఇతర పూజా సామగ్రిని రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సమర్పించేందుకు ప్రసాదాలను స్వయంగా తయారు చేసుకుని తీసుకువచ్చారు. ఉదయం గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభమై అనంతరం లక్ష్మీదేవి వ్రతకథలు, భక్తిగీతాలు, కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

పొదుపు సంఘాల సంచాలకులు నాగరాజు మాట్లాడుతూ పొదుపు సంఘాల ద్వారా పొదుపు, రుణాలలతోపాటు సభ్యులందరినీ ఒకచోట చేర్చి సామూహిక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మహిళల ఐక్యత, పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసేలా ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. లక్ష్మీదేవి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ట్రస్టీలు, క్లస్టర్ లీడర్లు, ప్రాజెక్ట్ ఆఫీసర్ రవి, బీబీవీ మేనేజర్ రమేష్, కృషి విజ్ఞాన కేంద్రం డాక్టర్ శ్రీనివాసులు, రామానుజులు, అన్బలగన్, స్వాతి, ఇందుమతి, జ్యోతి, నాగమణి, శంకరయ్యతో పాటు సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛరథాన్ని సద్వినియోగం చేసుకోండి.!

రామచంద్రాపురం, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త: స్వచ్ఛరథాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ పులిరామ్ సింగ్ కోరారు. శుక్రవారం ఎంపిడిఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో స్వచ్ఛరథం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుండి అక్టోబర్ 25 వరకు 14 గ్రామ పంచాయతీలలో స్వచ్ఛరథం పర్యటిస్తుందన్నారు. మూడు కిలోలు పొడి చెత్తను అందించిన వారికి నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తారన్నారు. మూడు కేజీలు అంతకు మించి పొడి చెత్తను స్వచ్ఛరథం సిబ్బందికి అందించిన కుటుంబాలకు బహుమతుల కూపన్లు అందజేస్తారన్నారు. విజయదశమి రోజున పంచాయతీల వారీగా లక్కీ డ్రా తీసి ప్రథమ, ద్వితీయ తృతీయ బహుమతులను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు సురేష్‌కుమార్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రత ప్రభుత్వ ప్రధాన అజెండా : ఎంపీడీవో



రేణిగుంట, సెప్టెంబరు 25 ప్రభాతవార్త: రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన అజెండాగా రేణిగుంట ఎంపీడీవో రవిచంద్ర, డిప్యూటీ ఎంపీడీవో ప్రభురావు తెలిపారు. రేణిగుంట మండలంలోని గ్రామ పంచాయతీల పరిధిలో పరిశుభ్రతను మరింత మెరుగుపరిచేందుకు మండల ప్రజలకు అవగాహన కల్పించడం కోసం శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. దసరా పండుగను పురస్కరించుకుని గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎంపీడీవో తెలిపారు. రేణిగుంట మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో స్వచ్ఛ రథం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. ఇళ్లలో పేరుకుపోయే పొడి చెత్తను రోడ్లపై, కాలువల్లో, బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా సేకరించి స్వచ్ఛ రథానికి అందించాలని సూచించారు. ముఖ్యంగా ప్లాస్టిక్, ఇతర పొడి వ్యర్థాలను వేరు చేసి స్వచ్ఛ రథంలో ఇచ్చి గ్రామాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.సెప్టెంబరు 26 నుంచి అక్టోబరు 26 వరకు నెల రోజుల పాటు ప్రక్రియ సాగుతుందన్నారు. 3 కిలోల కంటే ఎక్కువ పొడి చెత్తను (డ్రై వేస్ట్) స్వచ్ఛ రథానికి అందించే వారికి టోకెన్లు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ ఇళ్లలోని వ్యర్థాలను బాధ్యతగా వేరు చేసి స్వచ్ఛ రథానికి అందించడం ద్వారా పారిశుధ్య కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. అక్టోబరు 26న లక్కీ డ్రా నిర్వహించి టోకెన్లు పొందిన వారిలో ఎంపికైన వారికి మూడు ప్రత్యేక బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు.

## అమర రాజా బెటర్ వే అవార్డ్స్‌కు ఆహ్వానం

**రేణిగుంట, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** దేశంలో ఉపాధి, ఆదాయ కల్పన, మహిళా సాధికారత, ఆవిష్కరణలకు కృషి చేస్తున్న పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ అమర రాజా గ్రూప్ సంస్థలు బెటర్ వే అవార్డ్స్ నాలుగో ఎడిషన్‌ను శుక్రవారం ప్రకటించింది.నాలుగు విభాగాల్లో విజేతలకు ఒక్కొక్కరికి రూ.3 లక్షల నగదు బహుమతితో పాటు ఏడాది పాటు ఆర్థిక, మానవ వనరులు, మార్కెటింగ్, సాంకేతిక, సరఫరా గొలుసు రంగాల్లో ప్రత్యేక మెంటరింగ్ అందిస్తామని అమర్ రాజా యాజమాన్యం ప్రకటించింది. తొలిసారిగా 'భవిష్యత్ మార్పుకు దారితీసే యువత' విభాగాన్ని ప్రవేశపెట్టి, గ్రామీణ అభివృద్ధికి వినూత్న ఆలోచనలు చేస్తున్న గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులను గుర్తిస్తామన్నారు.మహిళల ఉపాధి, గ్రామీణ ఆదాయ కల్పన, వ్యవసాయ ఆధారిత వ్యాపారం, భవిష్యత్ మార్పుకు దారితీసే యువత విభాగాల్లో అవార్డులు అందజేస్తామన్నారు. గత మూడు ఎడిషన్లలో దేశవ్యాప్తంగా తొమ్మిది మంది పారిశ్రామికవేత్తలు, సంస్థలు గుర్తింపు పొందినట్టు తెలిపారు. సామాజిక ప్రభావం, ఉపాధి కల్పన, వ్యాపార నమూనా ప్రభావం, విస్తరణ సామర్థ్యం తదితర అంశాల ఆధారంగా స్వతంత్ర నిపుణుల బృందం విజేతలను ఎంపిక చేస్తారన్నారు. అర్హులైన వారు అమరరాజా డాట్ కామ్ స్లాష్ బెటర్‌వేఅవార్డ్స్ ద్వారా నవంబరు 11, 2026లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు గ్రామీణ ప్రతిభకు గుర్తింపు, ఆలోచనలకు అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని అమర రాజా గ్రూప్ లిమిటెడ్ కంపెనీ తెలిపింది.1985లో డాక్టర్ గల్లా రామచంద్ర నాయుడు స్థాపించిన అమర రాజా గ్రూప్ ప్రస్తుతం ఆటోమోటివ్, విద్యుత్ వాహనాలు, పారిశ్రామిక బ్యాటరీలు, మౌలిక వసతులు, ఎలక్ట్రానిక్స్, ఆహార శుద్ధి తదితర రంగాల్లో ముందుకు దూసుకుపోతుందన్నారు.డెబ్భైకి పైగా దేశాలకు ఉత్పత్తులను ఎగుమతి చేస్తు సంస్థలో 21 వేల మందికి ఉద్యోగాలు కల్పించిన ఘనత అమరాజా గ్రూప్స్ కు దక్కుతుందన్నారు.

## లాడ్జి గదిలో మహారాష్ట్ర వాసి ఆత్మహత్య

రేణిగుంట, సెప్టెంబరు 25, ప్రభాతవార్త: తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చిన మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి రేణిగుంటలోని లాడ్జిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం వెలుగుచూసింది. రేణిగుంట రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ లాడ్జిలో చోటుచేసుకున్న ఈ ఘటనపై రేణిగుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల కథనం మేరకు... మహారాష్ట్రలోని సోలాపూర్ నార్త్, బుధవార్ పేట్ ప్రాంతానికి చెందిన హీరాలాల్ లాంబ్రురే (40) తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చారు. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణానికి రైలు అందుబాటులో లేకపోవడంతో ఈ నెల 23వ తేదీ రాత్రి సుమారు 7.30 గంటలకు రేణిగుంటలోని ఒక లాడ్జిలోని 102వ నంబరు గదిని అద్దెకు తీసుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం సుమారు 2.30 గంటల సమయంలో లాడ్జి సిబ్బంది గది తలుపు తట్టినా ఎంతకూ తెరవకపోవడంతో అనుమానం వచ్చి తలుపులు తెరిచి చూడగా హీరాలాల్ గది తలుపు వెనుక ఉన్న హ్యాంగర్‌కు తువ్వాలుతో ఉరివేసుకుని విగతజీవిగా కనిపించారు. వెంటనే లాడ్జి నిర్వాహకుడు సుధాకర్ రెడ్డి పోలీసులకు సమాచారం అందించడంతో రేణిగుంట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతిలోని రుయా ఆసుపత్రికి తరలించారు.మృతుడు ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు లేదా ఇతర వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

## ఫెయిల్యూర్ అండ్ సక్సెస్ ప్రాధాన్యత పై కార్యక్రమం

తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త

జెసిఐ తిరుపతి పవర్ స్టూడెంట్ లీడర్షిప్ ట్రైనింగ్ ఇంపార్టెన్స్ ఆఫ్ ఫెయిల్యూర్ అండ్ సక్సెస్ అనే కార్యక్రమం శుక్రవారం మహతి ఆడిటోరి నందు నిర్వహించారు. ఇందుకు అతిథులుగా డాక్టర్ ఎమ్మెల్సీ పై సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జేడీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఆ కార్యక్రమంలో డాక్టర్ ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యంని సత్కరించారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులు విలువలతో కూడినటువంటి విద్య సాధించాలని మరియు పేదరికం నిర్మూలించాలి అంటే విద్యతోనే సాధ్యమవుతుంది అని విద్యార్థులకు ఉపదేశించారు. ఈ

## అర్హత ఉన్న న్యాయవాదులు దరఖాస్తులు చేసుకోవాలి

*తిరుపతి లీగల్, సెప్టెంబరు 25 ప్రభాతవార్త:* రాష్ట్ర బార్ కౌన్సిల్ రాష్ట్రంలోని న్యాయవాదులకు రెండు కీలక సర్క్యులర్లను జారీ చేసింది. అర్హత కలిగిన న్యాయవాదులు డిక్లరేషన్ ఫారాలు, ప్రాక్టీస్ సర్టిఫికెట్(సీవోపీ) దరఖాస్తులను నిర్ణీత గడువులో సమర్పించాలని సూచించింది. ఏఐబీఈ–16 నుంచి 21 వరకు ఉత్తీర్ణులైన న్యాయవాదులు, అలాగే సర్క్యులర్‌లో పేర్కొన్న అర్హతలు కలిగిన న్యాయవాదులు డిక్లరేషన్ ఫారం సమర్పించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ సెప్టెంబరు 25 నుంచి నవంబరు 25 2026 వరకు అందుబాటులో ఉంటుంది. దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని సంబంధిత బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శి సంతకం, ముద్రతో కూడిన హార్డ్ కాపీని నవంబరు 30 లోపు బార్ కౌన్సిల్‌కు పంపాల్సి ఉంటుంది. అదే విధంగా ఏఐబీఈ–14, 15లో ఉత్తీర్ణులై ఐదేళ్లు పూర్తయిన అర్హత కలిగిన న్యాయవాదులు ప్రాక్టీస్ సర్టిఫికెట్(సీవోపీ) కోసం దరఖాస్తు చేసుకోవాలని మరో సర్క్యులర్‌లో బార్ కౌన్సిల్ పేర్కొంది. సీవోపీ దరఖాస్తుకు రూ.500 రుసుమును ఎస్‌బీఐ చలాన ద్వారా చెల్లించాలని సూచించింది. అర్హత కలిగిన న్యాయవాదులు గడువు తేదీలను గమనించి, సంబంధిత దరఖాస్తులను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. ఈ వివరాలను తిరుపతి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.గోపిచంద్, ప్రధాన కార్యదర్శి విద్యానాథ్‌రెడ్డి తెలిపారు.

## ఫ్యాన్ ఊడి పడి ఒకరికి గాయాలు

*నాగలాపురం, సెప్టెంబరు 25 ప్రభాతవార్త:* నాగలాపురం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న ఫ్యాను ఊడి పడి ఒకరికి తీవ్రగాయాలైంది. వివరాలు ఇలా.... తిరుపతి నుంచి తన సొంత పని నిమితం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన వెంకటేష్ అనే అబ్బాయి కార్యాలయం లోపల కూర్చుని ఉండగా ఉన్నట్లుండి పై నుంచి ఫ్యాను బోల్టు ఊడి ఆయనపై పడి ఫ్యాన్‌రెక్కలు తగలడంతో చెవి కోసుకుని తీవ్ర రక్తస్రావం జరిగింది. వెంటనే స్థానికులు ఆయన నాగలాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యం చేసి 15 కుట్లు వేసినట్లు వారు తెలిపారు. దీంతో ఆయన చికిత్స తరువాత తన నివాసానికి బయలుదేరి వెళ్లారు.



## నులి పురుగుల నిర్మూలనే లక్ష్యం

వడమాలపేట, సెప్టెంబరు 25 ప్రభాతవార్త: బాల, బాలికల్లో తరచూ వచ్చే నులి పురుగులను నివారించడమే ప్రభుత్వ లక్ష్యమని వడమాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంవైద్యాధికారి సందీప్ తెలిపారు. శుక్రవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాలలకు వైద్య సిబ్బంది వెళ్లి 5306 పిల్లలకు గాను 5083 మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేయించడం జరిగింది. 96 శాతం మందికి వేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెన్నెల సాహితి, సీహెచ్‌వో పురుషోత్తంరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు మురళి, లలితమ్మ, ఎంపీహెచ్‌ఏ వెంకటరాజు, ఏఎన్‌ఎం జ్యోతి, ఆశ కార్యకర్తలు, ప్రధానోపాధ్యాయులు కరుణ, నవనీత, విమల తదితరులు పాల్గొన్నారు.



## రోడ్లు లేక నరకయాతన

సత్యవేడు, సెప్టెంబరు 25 ప్రభాతవార్త: మండలంలోని వెంకటరాజుల కండ్రిగలో కనీసమౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో సిమెంటు రోడ్లు లేకపోవడంతో వర్షాలు కురిసిన ప్రతిసారి రహదారులు బురదమయంగా మారి నడిచి వెళ్ళడమే నరకప్రాయంగా మారుతోందని స్థానికులు ఆవదేన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు వెడల్పులేకపోవడంతో వాహనాలు సైతం సులభంగా రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొందని, గ్రామంలోని రహదారులు కొండ ప్రాంతాల్లోని ఘాట్ మార్గాలను తలపిస్తున్నాయని వారు చెబుతున్నారు. మరోవైపు గ్రామం చుట్టూ అటవీ ప్రాంతం ఉండడంతో రాత్రివేళలో పాములు, విష పూరిత జీవులు సంచరిస్తున్నాయని, వీధిదీపాలు సక్రమంగా వెలగకపోవడంతో చీకట్లో బయటకు రావాలంటే ప్రాణభయంతో వణికిపోవాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, రాత్రి వేళలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఏ క్షణంలో ఏ ప్రమాదం ఎదురవుతుందోనన్న ఆందోళనతో జీవిస్తున్నామని అంటున్నారు. గ్రామంలో సిమెంటు రోడ్లు ఎందుకు వేయడం లేదని అధికార పార్టీ నాయకులను ప్రశ్నిస్తే సిమెంటు రోడ్లు వేస్తే తమకు డబ్బులు రావడం లేదని చెబుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజల అవసరాల కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రామంలోని రహదారుల పరిస్థితిని పరిశీలించి సిమెంటు రోడ్ల నిర్మాణం, రోడ్ల వెడల్పు, వీధి దీపాల ఏర్పాటుపై తక్షణ చర్యలు చేపట్టి తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని వెంకటరాజుల కండ్రిగ గ్రామస్తులు కోరుతున్నారు.

## పీర్ల చావిడికి స్థల సమస్య పరిష్కరించండి.!

### ముస్లీమ్ మత పెద్దలు తహశీల్దార్‌కు వినతి



చంద్రగిరి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త: స్థానిక కొత్తపేట మసీదు ఎదురుగా గల పీర్ల చావిడి స్థల సమస్యను పరిష్కరించాలని కోరుతూ మార్కెట్ యార్డు చైర్మన్ గౌస్‌భాషా, బహార్ ఆధ్వర్యంలో మత పెద్దలు శుక్రవారం తహశీల్దార్ దుద్దెల అమరేశ్వరికి వినతి ప్రతం అందజేశారు. గతంలో ఈ స్థలంపై తమకు హక్కులు వున్నట్లు గురునాథం అనే వ్యక్తి చూపిన పత్రాలను అప్పటి తహశీల్దార్ వెంకటేశ్వర్లు నకిలీవిగా తేల్చారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం మరోమారు గురునాథం సదరు స్థలంలోనికి ప్రవేశిస్తున్నట్లు ఆరోపించారు. ఈ నేపధ్యంలో పీర్ల చావిడి స్థలానికి సంబంధించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు.

## జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం



నింద్ర, సెప్టెంబరు 25 ప్రభాతవార్త : జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్లు జె.సుమలత,పిబి వినీషా ఆద్వర్యంలో ప్రారంబించినారు.ఈసందర్భంగా ముఖ్య అథిదిలుగా మండల విద్యాశాఖా ధికారులు వసుమతి,శ్రీధర్‌రాజులు పాల్గొని వారు మాట్లాడుతూ పిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత ఉండటం వల్ల నులిపురుగుల సంక్రమణ నివారించుచున్నారు.పిబి వినీషా మాట్లాడుతూ కలుషితమైన ఆహారం,నీరు,తీసుకోవడం వలన పిల్లలలో నులిపురుగుల సంక్రమణ జరుగుతుందని, దీనివలన పోషకాహార లోపం, రక్తహీనత,పెరుగుదల కుంటూపడడం జరుగుతుందని తెలిపారు. మండలంలో 1నుండి 19వయస్సు పిల్లలు 2152 మంది ఉన్నారని, అందులో 2044 మందికి 95శాతం మందికి ఆల్బెండజోల్ టాబ్లెట్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలోప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు,డిప్యూటి హెచ్ఇ యన్.గోపి,సిహెచ్ఓ శ్రీదేవి,పర్యవేక్షకులు సురేష్,వరలక్ష్మి,ఆశా వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణకు ఆల్‌బెండ్‌జోల్



రామచంద్రాపురం, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త: నులిపురుగుల నివారణకు విద్యార్థులకు ఆల్‌బెండ్‌జోల్ మాత్రలు వేయడం జరుగుతుందని ఎంపిడిఓ పులిరామ్ సింగ్ అన్నారు. శుక్రవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పరమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్‌బెండ్‌జోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పంబాదూరు పిహెచ్‌సి పరిధిలో 2284 మంది విద్యార్థులకు, కమ్మపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 6117 మంది విద్యార్థులకు పంపిణీ చేశామన్నారు. విద్యార్థులకు, చిన్నపిల్లలకు పారిశుధ్యంపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మార్కొండయ్య నాయుడు, హెచ్‌ఎం రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణ మాత్రలతో 98.71 శాతం కవరేజ్



రొంపిచెర్ల, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా రొంపిచెర్ల మండలంలోని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో 1 నుంచి 19 ఏళ్ల వయస్సు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. రొంపిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ దినేష్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.మండలంలోని పాఠశాలల్లో మొత్తం 3,965 మంది పిల్లలకు గాను 3,914 మందికి మాత్రలు వేయడంతో 98.71 శాతం కవరేజ్ నమోదైంది. పాఠశాలకు హాజరుకాని 51 మంది పిల్లలకు అక్టోబర్ 5న ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు వైద్యాధికారి తెలిపారు. నులిపురుగుల నివారణ మాత్రలతో పిల్లల శరీరానికి పోషకాలు సక్రమంగా అందడంతో పాటు రక్తహీనతను నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి 1-19 ఏళ్ల పిల్లలకు ఈ మాత్రలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, హెల్త్ సూపర్వైజర్ పంకజ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు

# శ్రీకాళహస్తి డివిజన్

## చెత్తను వేరు చేస్తేనే స్వచ్ఛత సాధ్యం...స్ఫూర్తి నింపిన కమిషనర్

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త: స్వచ్ఛత అనేది కేవలం నినాదం కాదు, ప్రతి ఒక్కరి జీవన విధానం కావాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలో ఉత్సాహంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఏపి ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ లో స్వచ్ఛతపై స్పోర్టివ్ కాంపిటీషన్స్, అవగాహన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే పరిశుభ్రతపై అవగాహన పెంచేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ కె.వి. కృష్ణారెడ్డి స్వయంగా హాజరై పరిశీలించారు. విద్యార్థులు వేసిన వ్యర్థాల నుంచి సంపద, పరిశుభ్రతపై నినాదాలు, పోస్టర్లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసి వారిని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛ శ్రీకాళహస్తి సాధనకు ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇంట్లో ఉత్పత్తి అయ్యే చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా విడదీసి మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు దాము, సుధాకర్, పవన్, సచివాలయ శానిటరీ సెక్రెటరీలు, శానిటరీ మేస్త్రీలు, మున్సిపల్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సోమానీ సెరామిక్స్‌ను సందర్శించిన పల్లం విద్యార్థులు




ఏర్పేడు, సెప్టెంబర్ 25 ప్రభాత వార్త: సమగ్ర శిక్షా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో వృత్తి విద్యలో భాగంగా తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం జెడ్పీహెచ్ఎస్ పల్లం పాఠశాలకు చెందిన 9వ మరియు 10వ తరగతి విద్యార్థులు శుక్రవారం పారిశ్రామిక సందర్శనలో భాగంగా మెసర్స్ సుధా సోమానీ సెరామిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను సందర్శించారని పాఠశాల ప్రధానోపాధ్యా యులు టి. ఆనంద్ తెలిపారు. ఈ సందర్శనలో విద్యార్థులు తమ ట్రేడులకు సంబంధించిన అనేక అంశాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఐటి/ఐటిఇఎస్ ట్రేడుకు సంబంధించి ఈఆర్పీ సాఫ్ట్ వేర్, ఇన్వెంటరీ మేనేజ్మెంట్, ఎలక్ట్రానిక్స్ హార్డ్ వేర్ ట్రేడుకు సంబంధించి పిఎల్సీ కంట్రోల్ ప్యానల్స్, సెన్సార్లు, పిసిబి సర్క్యూట్లు, ఆటోమోటివ్ ట్రేడుకు సంబంధించి ఫోర్క్ లిఫ్ట్, కన్వేయర్ బెల్ట్, హైడ్రాలిక్ సిస్టమ్స్ గురించి క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. కంపెనీ సిబ్బంది లోకేష్ నాయుడు, ప్రసాద్ ఎంతో సమన్వయంతో వ్యవహరించి చక్కగా నిర్వహించబడిన పరిశ్రమను చూపిస్తూ టైల్స్ తయారీ విధానం గురించి విద్యార్థులకు అద్భుతమైన విజ్ఞానాన్ని అందించారు. ఈ కార్యక్రమాన్ని వొకేషనల్ ట్రైనర్లు వి. సుధారాణి (ఐటి/ఐటిఇఎస్), జి. అరుణ్ కుమార్ (ఎలక్ట్రానిక్స్ హార్డ్ వేర్), కె.హర్షవర్ధన్ (ఆటోమోటివ్) నిర్వహించగా ఎన్. విజయ్ శేఖర్, పి.ఎస్.వి.రత్నం, వి.బిందుసారుడు సహకారం అందించారు.

## నులిపురుగులకు టాబ్లెట్లు తప్పక వేసుకోవాలి




ఏర్పేడు,సెప్టెంబర్ 25 ప్రభాతవార్త: పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం ఘనంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపల్ జి.వి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నులిపురుగులు సోకిన పిల్లలు రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి మందగించడం, నీరసం, ఆందోళన, కడుపునొప్పి, వాంతులు, విరోచనాలు, బరువు తగ్గడం వంటి ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం అందించే 400 మిల్లీగ్రాముల ఆల్బెండజోల్ టాబ్లెట్లను ప్రతి విద్యార్థి తప్పనిసరిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ మెడికల్ అండ్ హెల్త్ శాఖ తరఫున పాపానాయుడుపేట ప్రాథమిక వైద్యారోగ్యశాఖ నాగరాజు, లావణ్య ఆధ్వర్యంలో ఏఎన్ఎం ఉషారాణి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బి. లహరి విద్యార్థులకు టాబ్లెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణ కిషోర్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## ఆపరేషన్ త్రిశూల్‌తో నేరాలపై ఉక్కుపాదం

బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖ ప్రవేశపెట్టిన ఆపరేషన్ త్రిశూల్ ద్వారా నేరాలను పూర్తిగా అరికట్టేందుకు అసాంఘిక కార్యకలాపాలు నిర్మూలిస్తూ శాంతి భద్రతలకు ఆటంకం కలిగించే వారిపై చట్టరీత్యా ఉక్కుపాదం మోపి చర్యలు తీసుకుంటామని ఎస్సై హరిప్రసాద్ తెలిపారు. మండలంలోని కారణిమిట్ట గ్రామంలో ఆపరేషన్ త్రిశూల్ కార్యక్రమాన్ని నిర్వహించి గంజాయి, సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్సై హరిప్రసాద్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల స్వరూపం కూడా మారుతోందని, నేరాలను అరికట్టేందుకు పోలీసులతో పాటు ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు, వర్గవిభేదాలకు తావులేకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## అంగన్‌వాడీ కార్యకర్తల సేవలకు సత్కారం



తొట్టంబేడు, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజాసేవను పురస్కరించుకుని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్ అంగన్ వాడీ ఉత్సవాలు శ్రీకాళహస్తి ప్రాజెక్టు పరిధిలో ఘనంగాప్రారంభమయ్యాయి. శుక్రవారం తొట్టంబేడు మండలం కొంతనేరి గ్రామంలో సిడిపిఒ, సూపర్ వైజర్, అంగన్ వాడీ కార్యకర్తలు, పాఠశాలప్రధానోపాధ్యాయులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో సేవలందిస్తున్న అంగన్ వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశా కార్యకర్తలను బహిరంగంగా గుర్తించి ప్రశంసించి సత్కరించారు. ఈ సందర్భంగా సిడిపిఒ, సూపర్ వైజర్ మండలు మాట్లాడుతూ పోషణ, ఐసిడిఎస్ ద్వారా అందుతున్న సేవల గురించి వివరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## చెత్త ఇస్తే కూపన్, కూపన్ కు బహుమతి



బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త : చెత్తను పడేయకండి, బహుమతులు గెలుచుకోండి అంటూ బి.ఎన్.కండ్రిగ మండల ప్రజా పరిషత్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇంటి నుండి సేకరించే పొడి చెత్తకు కూపన్ ఇచ్చి, లక్కీ డ్రా ద్వారా బహుమతులు అందించే కార్యక్రమాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి వెంకటరత్నమ్మ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం బి.ఎన్.కండ్రిగ మండలంలోని 28 గ్రామ పంచాయతీల నుండి ఏప్రిల్ 2026 నుండి ఇప్పటి వరకు స్వచ్ఛరథం ద్వారా ప్రతి ఇంటి నుండి సేకరించిన పొడి చెత్త సుమారుగా 9771 కిలోలు సేకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రజలందరూ పాల్గొని ఇంట్లోని విరిగిన చెత్తను స్వచ్ఛరథమునకు అందించాలని కోరారు.

## మిద్దెలహరి బాటలోనే నాప్రయాణం

**- వైసిపి నేత కోట కరుణాకర్‌శెట్టి**



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త: ఏపిఎస్ ఆర్టీసి మాజీ రాష్ట్ర వైస్ ఛైర్మన్ ఆప్కో మాజీ డైరెక్టర్ మిద్దెల హరి అడుగుజాడల్లో తాను కూడా నడుస్తానని వైసిపికి రాజీనామా చేసి త్వరలో జనసేన పార్టీలోకి చేరనున్నట్లు వైకాపా నేత కోట కరుణాకర్ శెట్టి ప్రకటించారు. శుక్రవారం మిద్దెల హరి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సమక్షంలో పార్టీ కండువాను కప్పుకున్నారు. ఈ నేపథ్యంలో తన శ్రేణులను ఉద్దేశించి తాను కూడా జనసేనలోకి రానున్నట్లు తెలిపారు. జనసేన పార్టీ బలోపేతానికి ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆశయసాధనకు కృషి చేస్తానని తెలిపారు.

## పోలీస్ అధికారులకు క్షమాపణలు చెప్పిన హేమలత

తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త: గత రెండు రోజులకు ముందు వినాయక నిమజ్జనంలో జరిగిన గొడవ విషయమై తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్లో లింగేశ్వర్ నగర్‌కు చెందిన టిడిపి మహిళా నాయకురాలు హేమలత పోలీసు వారితో దురుసుగా ప్రవర్తించడంపై పోలీసు ఉన్నతాధికారులకు, సిబ్బందికి హేమలత క్షమాపణలు చెప్పారు.శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలీస్ స్టేషన్ లో జరిగిన ఇష్యూ పై అక్కడ ఏ పొలిటికల్ పార్టీకి సంబంధించిన వ్యక్తులు గాని, ఇతర వ్యక్తులు ఎవరూ లేరని,అక్కడ వీడియో చిత్రీకరించి పోలీసు వారే వైసీపీకి చెందిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి అందించడంతో,వారు జరిగిన విషయాన్ని కట్ చేసి వారికి కావలసిన అంతవరకు సోషల్ మీడియాలో ట్రోల్ చేయడం ఎంతవరకు సబబు అని వైసిపి వాళ్లని ప్రశ్నించారు.అక్కడ జరిగిన ఇష్యూలో నేను ఉన్నానని, చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నానికి ఏంటి సంబంధం అని, ఏదైనా తప్పు జరిగి ఉంటే నన్ను ట్రోల్ చేయండి అంతేకానీ ఎమ్మెల్యే కి,పార్టీ నాయకులకు అంటగట్టడం దారుణం అన్నారు.గత ప్రభుత్వంలో పసుపు చీర కట్టినందుకే వైసీపీ వాళ్లు తనను అరెస్టు చేయించారని, తను కరుడుగట్టిన టిడిపి అభిమాని అని పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న,పోలీసు వ్యవస్థ వైసిపి వాళ్లకే పని చేస్తున్ననడానికి ఈ సంఘటనే నిదర్శనం అన్నారు. చదువుతున్న విద్యార్థుల పైన కేసులు పెట్టడం ఎంతవరకు సబబు అన్నారు. అక్కడ జరిగిన పరిణామం మొత్తం పోలీస్ స్టేషన్లోని సీసీ కెమెరాలలో రికార్డు అయినదని, మొత్తం వీడియో రికార్డును పరిశీలిస్తే అసలు విషయాలు తెలుస్తాయి అన్నారు. ఈ విషయమై తిరుపతి ఎస్పీకి అన్ని వివరాలతో కూడిన, సాక్షాధారాలతో వినతి పత్రం త్వరలో అందజేస్తానని, సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరతానన్నారు.

## సింగపూర్ మంత్రికి ఎంజిఎంలో స్వాగతం



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరస్వామి దర్శనార్థం విచ్చేసిన సింగపూర్ సీనియర్ మంత్రి, ఆపద్ధర్మ ప్రధాని కాశీ విశ్వనాథన్ షణ్ముగంకు ఎంజీఎం గ్రూప్ కుటుంబం ఘన స్వాగతం పలికింది. శుక్రవారం ఎంజీఎం హాస్పిటల్స్ హెలిప్యాడ్‌లో ల్యాండ్ అయిన ఆయనకు ఎంజీఎం గ్రూప్ ఛైర్మన్ గుడ్లూరు మల్లికార్జున నాయుడు, ఆయన కుమారుడు గుడ్లూరు మయూర్, కోడలు ఐశ్వర్య లక్ష్మిలు సాదర స్వాగతం పలికారు. ఎంజీఎం హోటల్ ఆవరణలో పండించిన రుద్రాక్షలతో తయారు చేసిన మాలను బహూకరించారు. అనంతరం మంత్రి శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని దర్శించుకుని, ఎంజీఎం ఆసుపత్రిని సందర్శించి అక్కడి వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం గ్రూప్ డైరెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ డాక్టర్ గుడ్లూరు మయూర్, ఐశ్వర్య లక్ష్మి పాల్గొన్నారు.

## ఎస్వీఏ కళాశాలలో నులిపురుగుల నివారణ దినోత్సవం




శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని ఎస్.వి.ఏ. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జువాలజీ విభాగం, రెడ్ రిబ్బన్ క్లబ్, యూత్ రెడ్‌క్రాస్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ ఆర్.బి. వాణిశ్రీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, పరిశుభ్రత లోపం వల్ల నులిపురుగులు వ్యాప్తి చెందుతాయని, ఇది విద్యార్థుల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. చేతులు శుభ్రంగా కడుక్కోవడం, గోళ్లు కత్తిరించుకోవడం, కాచి చల్లార్చిన నీరు తాగడం వంటి అలవాట్లతో నులిపురుగులను నివారించవచ్చని సూచించారు. అనంతరం విద్యార్థులకు నులిపురుగుల నివారణకు సంబంధించిన ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ మన్యం నరసింహులు, డాక్టర్ టి. గంగారం, డాక్టర్ తులసి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## షర్మిల కుమార్తె నిశ్చితార్థానికి...కాంగ్రెస్ నాయకులు



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త: రంగారెడ్డి జిల్లా కొత్తలగూడలోని ఆనంద కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి కుమార్తె వైఎస్ అంజలిరెడ్డి నిశ్చితార్థ వేడుకకు అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు తిరుపతి జిల్లా నుండి డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు, శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి ప్రత్యేకంగా హాజరయ్యారు. వారు వధూవరులకు శుభాకాంక్షలు తెలిపి, వైఎస్ షర్మిలా రెడ్డికి అభినందనలు తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తొట్టంబేడు, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త: తొట్టంబేడు మండలంలో నివసిస్తున్న విద్యుత్ వినియోగదారులకు నేడు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చిన్న రెడ్డప్ప ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతు పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## ఉపాధి హామీ వేతనం రూ. 600కు పెంచాలి



తొట్టంబేడు, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త: తొట్టంబేడు మండల మేజర్ పంచాయతీ గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం జరిగింది. సంఘం నాయకులు రుద్రపాకు శ్రీనివాసులు ఆధ్వర్యంలో, రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సంఘం జిల్లా నాయకులు జె.తులసిరాజన్, మించల శివకుమార్ పాల్గొని మాట్లాడారు. తొట్టంబేడు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పని రోజులు 200 రోజులకు పెంచాలని, ఉపాధి కూలీలకు రోజుకు 600 రూపాయలు వేతనం మంజూరు చేసి జాబ్ కార్డులకు అతీతంగా పని కల్పించాలని డిమాండ్ చేశారు.అనంతరం పంచాయతీ కార్యదర్శి జ్ఞాన ప్రకాష్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పరశురామయ్య, మల్లేశ్వరమ్మ, వినాయక.. తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ పటిష్టతకు కృషి చేయండి



శ్రీకాళహస్తి సెప్టెంబర్ 25 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన నాయకులు మంగళగిరిలోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరామ్ తాళ్లూరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జరుగుతున్న తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతం కోసం చేపడుతున్న కార్యక్రమాలు, అలాగే ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి జనసేన పార్టీలో చేరిన 40 మంది నాయకులు, యువకుల చేరికల వివరాలను రాష్ట్ర కార్యదర్శికి తెలియజేశారు. అదేవిధంగా శ్రీకాళహస్తిలో వివిధ రాజకీయ పార్టీల నుంచి మరిన్ని చేరికలు కొనసాగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కుమార్, మాధవ మహేష్, ఈర్ల చిరంజీవి పాల్గొన్నారు.

## సమృద్ధి అభివృద్ధి ఆరాధనతోనే సాధ్యం : రేహాన్



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 25 ప్రభాతవార్త: సమృద్ధి,అభివృద్ధి అల్లాహ్ ఆరాధనతోనే సాధ్యమని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ అన్నారు.శుక్రవారం జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా మాట్లాడుతూ మనం నేడు అల్లాహ్ వరాలను విస్మరించి వ్యవహరించటం వల్ల నిత్యం బాధల సుడిలో నలుగుతున్నామన్నారు. మనం ఎంత సంపాదించినా సమృద్ధి లేదని కలవర పడుతుంటాము. అయితే మనం మనకు అల్లాహ్ ప్రసాదించిన వరాలను అనుభవిస్తూ విస్మరిస్తున్నామన్నారు. ఇస్లాం మతం వేకువ జామున లేచి నిత్యం అల్లాహ్ ఆరాధనతో తమ కార్యక్రమాలు చేపట్టాలని అలాగే ప్రతి పనిని అల్లాహ్ స్మరణతో చేపడితే సమృద్ధి ఉంటుందన్నారు. ఇంటిలో ప్రవేశించే టప్పుడు సలాం చెబుతూ వెళ్ళాలని ఇంటిలో పెద్దలను భారంగా భావించరాదని, అలాగే మనకు గల చెడు అలవాటుల్లో ఆలస్యంగా నిద్రలేవటం, రాత్రి ఆలస్యంగా పడుకోవటం చేస్తుంటామన్నారు.ఈ విధానాలు సరి కాదన్నారు. పూర్వీకులు ఆచరించిన విధానాలను ఆచరిస్తూ మన సంపాదనల్లో సమృద్ధి సాధించుకోవాలన్నారు. అంతేకాక మన ఆహారపు అలవాట్లు కూడా మార్చుకోవాలన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి!

ఏర్పేడు, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త: ఏర్పేడు శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్ల మధ్య వేర్లపాక సమీపంలో 70/12, 70/13 స్తంభాల మధ్య గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైలులో శ్రీకాళహస్తి వైపు వెళ్తూ ప్రమాదవశాత్తు పడిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడి శరీరం రెండు ట్రాకుల మధ్య పడి ఉంది. తలపై తీవ్ర గాయాలు కావడంతో ముఖంపై రక్తపు మరకలు ఎండిపోయి శవాన్ని గుర్తుపట్టలేని విధంగా ఉంది. రైల్వేకీ మెన్ రఘుఅధికారులకు సమాచారం అందించారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు సుమారు 55 ఏళ్లు ఉండవచ్చని తెలుస్తోంది. పూర్తి వివరాలు రైల్వే పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

## ప్రజల గుండె చప్పుడు వింటూ... సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త: నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి సత్వర పరిష్కారం చూపే దిశగా శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్‌రెడ్డి శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం నుంచే నియోజకవర్గం లోని మారుమూల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తమ సమస్యలను విన్నవించుకునేందుకు క్యాంపు కార్యాలయానికి తరలివచ్చారు. వచ్చిన ప్రతి ఒక్కరినీ ఎమ్మెల్యే స్వయంగా పేరుపేరునా పలకరించి, వారి వద్ద నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఎవరి సమస్యను నిర్లక్ష్యం చేయకుండా అత్యంత ఓపికగా విని, వారికి భరోసా కల్పించారు. అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యల తక్షణ పరిష్కారానికి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడం, వారి కష్టాల్లో అండగా నిలబడటమే తన ప్రధాన బాధ్యత అని అన్నారు. ఎమ్మెల్యే స్పందన పట్ల ప్రజలు అభినందనలు తెలిపారు.

## అంత్యోదయే బీజేపీ లక్ష్యం : అమర్‌నాథ్

తొట్టంబేడు, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త: భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక సిద్ధాంతకర్త, మహానాయకుడు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ 110వ జయంతి వేడుకలను తొట్టంబేడు మండలం కొత్త కండ్రిగ గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షులు వెడాం కిష్టయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ ఆంధ్రప్రదేశ్ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.వి. అమర్‌నాథ్ అతిథిగా హాజరై దీన్ దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జి.వి. అమర్ నాథ్ మాట్లాడుతూ దేశం కోసం, పార్టీ బలోపేతం కోసం పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ అందించిన సేవలు అజరామరమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివా రెడ్డి, రత్నంరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, బాలాజీరెడ్డి, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్ విజేతలకు లక్ష బహుమతి ప్రకటించిన ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త: ఆధ్యాత్మిక క్షేత్రమైన శ్రీకాళహస్తి పుణ్యభూమి శుక్రవారం జాతీయ క్రీడా సందడితో మార్మోగింది. పట్టణంలోని ఎస్.వి. ఆర్ట్స్ కళాశాల మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో 72వ సీనియర్ నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ 2026 పురుషులు, మహిళల విభాగం పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో వైభవంగా ప్రారంభమైంది. శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, కోలా ఆనంద్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారుల మార్చ్ పాస్ట్‌తో ప్రాంగణం కోలాహలంగా మారింది. ఈ సందర్భంగా బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఆధ్యాత్మిక క్షేత్రమైన శ్రీకాళహస్తిలో ఇటువంటి జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని, దేశం నలుమూలల నుండి విచ్చేసిన క్రీడాకారులకు ఆతిథ్యం ఇవ్వడం సంతోషంగా ఉందని అన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న పోటీలలో మొదటి స్థానం సాధించిన విజేతకు తాను వ్యక్తిగతంగా రూ.లక్ష బహుమతిని ప్రకటించారు. క్రీడాకారుల్లో ఉత్సాహం నింపేందుకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ప్రత్యేక ప్రకటన చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు రంగినేని చెంచయ్య నాయుడు, కాసరం రమేష్, రావిళ్ళ మునిరాజ నాయుడు, విజయ్ కుమార్ నాయుడు, క్రీడా సంఘాల ప్రతినిధులు, వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన ఆటగాళ్లు, కోచ్‌లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అధ్యక్షులు సిహెచ్ వెంకటస్వామి, రాష్ట్ర కార్యదర్శి బాలాజి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలు, అంగన్ వాడీల్లో ఆల్బెండజోల్ పంపిణీ



బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త: పిల్లల్లో రక్తహీనతను అరికట్టేందుకు మండల వ్యాప్తంగా నులిపురుగుల నివారణ మాత్రలు ఆల్బెండ జోల్ పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ నందు ఎంపీడీవో వెంకటరత్నమ్మ, ఎంఈఓ రవీంద్రనాథ్ విద్యార్థులకు స్వయంగా టాబ్లెట్లను మింగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రతి అంగన్ వాడీ కేంద్రంలో, ప్రతి పాఠశాలలో, జూనియర్ కళాశాలల్లో ఒక సంవత్సరం నిండి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ మరియు బడి బయట ఉన్న పిల్లలకు కూడా ఈ మాత్రలను మింగించడం జరిగిందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య అధికారి వెంకటేశ్వర్లు, ఆరోగ్య సిబ్బంది, అంగన్ వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్పా ముసుగులో వ్యభిచారం!

**- 5 మంది మహిళలు షెల్టర్ హోమ్‌కు తరలింపు- పోలీసుల అదుపులో స్పాసెంటర్ యాజమాని, మేనేజర్‌లు**

చిత్తూరు, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త: చిత్తూరు నగర పరిధిలో స్పాసెంటర్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ స్పా సెంటర్‌పై శుక్రవారం వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ చిన్నపెద్దయ్య ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో స్పా సెంటర్‌లో వ్యభిచారం చేయడానికి సిద్ధంగా వున్న ఐదు మంది మహిళలను గుర్తించి వారిని పోలీసులు షెల్టర్ హోమ్‌కు తరలించగా, స్పా సెంటర్ యాజమాని, స్పా సెంటర్ మేనేజర్‌తో పాటు ఒక విటుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ చిన్నపెద్దయ్య మాట్లాడుతూ ఇలాంటి కార్యకలాపాలకు సహకరించిన సంబంధిత స్పా సెంటర్ యాజమాని, మేనేజర్‌పై చర్యపరమైన కేసులు నమోదు చేశామన్నారు. వ్యభిచారం, మహిళల అక్రమ రవాణా, ఇతర సాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ చిన్నపెద్దయ్య హెచ్చరించారు. అలాగే లాడ్జీలు, హోటళ్ళు, గెస్ట్‌హౌస్‌ల యాజమానులు తమ సంస్థల్లో జరిగే కార్యకలాపాలపై పూర్తి బాధ్యత వహించాల్సి వుంటుందని స్పష్టం చేశారు.

## బీసీలకు 50 ఏళ్ల పెన్షన్ అమలు చేయండి

**- వైసీపీ బీసీ సెల్ టౌన్ అధ్యక్షులు తండ్లం మోహన్ యాదవ్**



తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త: గత ఎన్నికల సమయంలో కూటమి మేనిఫెస్టోలో బీసీలకు 50 ఏళ్లకే నెలకు 4వేలు పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చారని, ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా హామీని ఎందుకు అమలు చేయలేదని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ టౌన్ అధ్యక్షులు తండ్లం మోహన్ యాదవ్ పత్రికా ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రతి సమావేశంలోనూ బీసీల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతున్నప్పటికీ ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీసీ రిజర్వేషన్ పై ఇంతవరకు స్పష్టత ఇవ్వలేదని, ఇచ్చిన హామీలను అమలు చేసి కొత్త హామీల ప్రకటనలు చేయాలన్నారు.బీసీల 50 ఏళ్ల పెన్షన్ హామీని ప్రభుత్వం అమలుపై స్పందించకపోతే బీసీ సంఘాలు, ప్రజా సంఘాలను కలుపుకొని ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమ కార్యాచరణ చేపడతామని తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే అయా వార్డు, సచివాలయాల వద్ద నిరసన చేస్తామన్నారు.

## ఇండిగో విమానం అత్యవసర ల్యాండింగ్

రేణిగుంట, సెప్టెంబరు 25 ప్రభాతవార్త: హైదరాబాద్ నుంచి రేణిగుంటకు(తిరుపతి) విమానాశ్రయానికి వచ్చిన ఇండిగో విమానంలో అత్యవసర పరిస్థితి ఏర్పడటంతో తిరిగి రేణిగుంట విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. విమానంలో ఉన్న సుమారు 130 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.హైదరాబాద్ నుంచి మధ్యాహ్నం 1.50 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఇండిగో విమానం, తిరిగి మధ్యాహ్నం 2.25 గంటలకు బయలుదేరాల్సి ఉంది. సాంకేతిక లోపం కారణంగా విమానం టేకాఫ్ కావడంలో సుమారు గంట ఆలస్యం జరిగినట్లు సమాచారం. విమానం బయలుదేరి గాల్లోకి ఎగిరిన కొద్దిసేపటికే అత్యవసర పరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తోంది. పరిస్థితిని గుర్తించిన పైలట్ సమయస్ఫూర్తితో వ్యవహరించి, విమానాన్ని కొద్దిసేపు ఆకాశంలో చక్కర్లు కొట్టించిన అనంతరం తిరిగి రేణిగుంట విమానాశ్రయం వైపు మళ్లించారు. సురక్షి తంగా విమానాన్ని ల్యాండ్ చేయడంతో ప్రయాణికులు, విమాన సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు. విమానంలోని ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నారని సమాచారం.విమానంలో తలెత్తిన అత్యవసర పరిస్థితికి పూర్తి కారణాలు అధికారికంగా తెలియాల్సి ఉంది. ఘటనపై సంబంధిత అధికారులు, విమానయాన సంస్థ నుంచి వివరాలు వెలువడాల్సి ఉంది.